విద్యార్థులకు స్కూలు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన స్కూలు కిట్లు, యూనిఫాములను స్థానిక టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. నీటి సంఘం అధ్యక్షులు ఎలకల అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుధారాణి సారథ్యంలో స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న 144 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు, ప్రసాద్ మాస్టర్, ఎంపీటీసీ కరణం చిన్నమనాయుడు, టీడీపీ నాయకులు మోపాడు తేజ కోటి ఎలకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

విశాలాంధ్ర -జామి: మండలంలోని రామయ్యపాలెంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లును శుక్రవారం రాష్ట్ర వెలమ కార్పోరేషన్ డైరక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేసారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని విదాలా సహాయ, సహకారాలు అందిస్తోందని చక్కగా చదువుకుని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరుతేవాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు పాల్గొన్నారు.

రోశయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎస్.కోటలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొణిజేటి రోశయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సంఘ అధ్యక్షులు హనుమల శెట్టి నానాజీ మాట్లాడుతూ రోశయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఆర్థిక, ఆరోగ్య శాఖల మంత్రిగా అద్భుత సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రేపాక సన్యాసి శెట్టి, కొదేటి సత్యనారాయణమూర్తి, కొనగర్ల శీను పాల్గొన్నారు.

విద్యా విధానంలో సంస్కరణలు సరికొత్త ఒరవడి

విశాలాంధ్ర - లక్కవరపుకోట: విద్యా విధానంలో సంస్కరణలు సరికొత్త వరవడిని సృష్టించాయని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్స్ కిట్లు ఆమె పంపిణీ చేశారు. విద్యా శాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఏకైక లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సిహెచ్ కూర్మారావ్, సర్పంచ్ కెర్రు పార్వతి, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు, పుట్ట శ్రీనివాసరావు, పాఠశాల ఎస్ఓ బి.ప్రవీణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోంపురం పంచాయతీ కార్యదర్శిగా వి.కృష్ణారావు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని సోంపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విశ్వనాథం కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీలలో భాగంగా బదిలీపై సోంపురం వచ్చారు. ఈ మేరకు సోంపురం గ్రామంలో తన విధులను సక్రమంగా నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడతానని ఆయన అన్నారు.

కాంగ్రెస్ నియోజక వర్గ సమన్వయకర్తగా శ్రీనివాస్

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: కాంగ్రెస్ పార్టీ విజయనగరం నియోజకవర్గ సమన్వయకర్తగా సానమనేటి శ్రీనివాస్ నియమితుల య్యారు. ఈ మేరకు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈయనకు నియామక పత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీనివాస్ గత కొన్ని సంవత్సరాలుగా విజయనగరంలో సేవలు అందిస్తున్నారు. తన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని అన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగులు నిరసన చేపట్టారు. రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి మాట్లాడుతూ సస్పెన్షన్లు, తొలగింపు లేకుండా 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, వెంటనే పదోన్నతులు చేపట్టాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారానే కొనాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని, పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని, 11వ పిఆర్‌సి 24 నెలల బకాయిలను ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్ క్యాష్‌మెంట్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి సిహెచ్‌పి పట్నాయక్, డివిఆర్ఎస్ నారాయణ, కె.వి.రమణ, పి.శ్రీను, జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షులు ఏ.అశోక్ పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమం

ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి

విశాలాంధ్ర - జామి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిం చడమే కాక పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఈ ఏడాది గేర్ మారుస్తున్నా మని, సంక్షేమంతో పాటుగా అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తామని ఆమె పేర్కొన్నారు. మండల కేంద్రమైన జామిలో పలు వార్డుల్లో ఎమ్మెల్యే సుపరిపాలనకు తొలి అడుగు ఇంటింటి ప్రచారాన్ని శుక్రవారం ఉదయం విస్తృతంగా నిర్వహించారు. ముందుగా పార్టీ నేతలతో కలిసి దొండపర్తిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దొండపర్తినుంచి రెల్లిపేట, ఎస్సీ కాలనీలలో సుపరిపాలనకు తొలి అడుగు విజయవంతంగా జరుగుతున్న సందర్భంగా నాయకులుతో కలిసి ఎస్సీ కాలనీలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ వంటి అంశాలను, రాబోవు రోజుల్లో చెయ్యబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీ లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు స్వామినాయుడు, ప్రధాన కార్యదర్శి వర్రి రమణ, జి.ఎర్నాయుడు, రాయవరపు శ్రీను, సూర్రెడ్డి ఝాన్సీ,అల్లాడ పెద్దా, మండల తెలుగు యువత అధ్యక్షులు రాయవరపు శంకర్, కొటాన వెంకట లక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షురాలు రాయవరపు లక్ష్మి, గొర్లె అప్పలనాయుడు, వర్రిలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామ సభలో విద్యుత్ సమస్యల మొర....

పారిశుద్ధ్యంపై నిలదీసిన గ్రామ ప్రజలు

త్రాగునీటి సమస్యతో సతమతం

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలోని కోనాడలో మూడోవ రోజున గ్రామసభలు నిర్వహించారు. అధికారులు పలు అభివృద్ధి పనుల కోసం తీర్మానాలు చేసి, గ్రామంలో సమస్యలపై చర్చించారు. కోనాడ గ్రామంలో సర్పంచ్ ఉదయ్ భారతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అందులో గ్రామంలో పారిశుధ్యం పనిచేసే కార్మికులు చాలా ఇబ్బంది పడుతున్నారని గ్రామంలో పలు వీధులు శుభ్రం చేయటం కష్టంగా ఉందని తెలియజేయడంతో తగు చర్యలు తీసుకుంటామని కార్యదర్శి భూషణ్ సముదాయించారు. జనసేన నాయకుడు విజ్జపు కిరణ్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ భవనం నిర్మాణం కోసం అవసరమైతే ఫండ్ లేకపోయినా తన సొంత డబ్బులతో నిర్మాణం చేయటానికి సుముఖంగా ఉన్నానని ఉత్తర్వులు రాగానే నిర్మాణం మొదలు పెడతానని తెలిపారు. గ్రామంలో కొంత భాగం మంచినీళ్ళు వెళ్ళక ఇబ్బంది పడుతున్నారని దాని విషయంలో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్ భారతి, సర్పంచ్ ప్రతినిధి ఎల్లజీ,విజ్జురపు కిరణ్ కుమార్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు తగ్గుదలపై విశ్లేషణ జరగాలి

తాటిపూడి నీటిపై ఆందోళన అవసరం లేదు
రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - విజయనగరం: గత ఏడాది కన్నా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గుదలపై శాస్త్రీయంగా విశ్లేషణ జరగాలని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది కన్నా ఈ ఏడాది సుమారు 8 వేల మంది తక్కువగా నమోదైనారని అయితే ఇంకా ఆఫ్ లైన్ అడ్మిషన్స్ ఉన్నాయని, వీటిని కలిపినా నమోదు తగ్గితే అందుకు గల కారణాలను గుర్తించాలని డి.ఈ.ఓకు సూచించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల మెరకముడిదాం మండలంలో తనిఖీ చేసినప్పుడు గత ఏడాది కన్నా 1100 మంది తగ్గారని తెలిసిందని, ఒకే మండలంలో ఇంత మంది తగ్గితే జిల్లా అంతటా ఈ సంఖ్యా ఎక్కువే ఉంటుందని అన్నారు. అలాగే తల్లికి వందనం పథకం క్రింద 13 వేలు తల్లుల ఖాతాలకు వేసారని, మిగిలిన 2 వేలు పాఠశాలల ఖాతాల్లో వేస్తామన్నారు కాని వేయలేదని, అవి ఎపుడు వేస్తారని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ స్పందిస్తూ అడ్మిషన్స్ పై ఒక స్పెషల్ డ్రైవ్ తీసుకోనున్నామని, 5 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్క బాల బాలిక ఏదో ఒక పాఠశాలలో ఉండేలా చూస్తున్నామని, బడి బయట పిల్లలు లేకుండా తగు చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే ఐ.సి.డి.ఎస్. నుండి అంగన్వాడీ నుండి విడుదలైన వారి జాబితాలను సమర్పించాలని కోరడం జరిగిందని తెలిపారు. గొర్రిపాటి బుచ్చి అప్పా రావు తాటిపూడి జలాశయం గురించి రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఎం.ఎస్.ఎం.ఈ పార్కుకు తాటిపూడి నుండి నీరందించడంపై ప్రభుత్వంలో చర్చకే రాలేదని, అనవసరంగా రైతులను రెచ్చ గొట్టవద్దని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జి.ఓ వచ్చిందని, అయితే జిందాల్ సంస్థే స్వయంగా నీటిని సమకూర్చు కోవాలని, ప్రభుత్వం నీరం దించాలని ఉంది కానీ తాటిపూడి నుండే అందిం చాలని స్పష్టంగా లేదని తెలిపారు. తొలుత జిల్లా పరిషత్ ఆవరణలో అల్లూరి జయంతి సంద ర్భంగా వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, పలువురు ప్రజా ప్రతినిధులు, రెండు జిల్లాల కలెక్టర్లు డా.బి.ఆర్. అంబేద్కర్, శ్యాం ప్రసాద్ నివాళు లర్పించారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు గాదె శ్రీనివాసులు నాయుడు, బొబ్బిలి సనన శాసన సభ్యు లు బేబీ నాయన, ప్రభుత్వ విప్ తోయిక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనేల రవి చంద్ర, లోకం నాగమధవి, డిసిసిబి, డి.సి.ఎం.ఎస్, కాపు కార్పొ రేషన్ చైర్మన్‌లు కిమిడి నాగార్జున, గొంప కృష్ణ, పాలవలస యశస్వి పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె తాత్కాలిక విరామం

విశాలాంధ్ర - రాజాం: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల 59 రోజుల సమ్మె సిడిఎంఏ (సిడిఎంఏ) హామీతో తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నామని రేపటి నుంచి విధులకు యధావిధిగా హాజరవుతామని యూనియన్ నాయకులు రామ్మూర్తి నాయుడు తెలిపారు. వేతనాలు పెంపు ఇతర అంశాలు మంత్రి వర్గం ఆమోదంతో అమలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమణ చేస్తున్నామని తెలిపారు. హామీని 10 రోజుల్లో పరిష్కరించకపోతే మళ్లీ నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనిల్, భాస్కరరావు, మోహన్, కృష్ణ, గణపతి, రామకృష్ణ, ప్రసన్న, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

గజపతినగరంలో గ్రామసభ

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరం గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామ సభ సర్పంచ్ నరవ కొండమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో సభ్యులు ఆమోదించిన మేరకు జరుగు అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన

గజపతినగరం ఏఎంసి చైర్మన్ పివి గోపాల రాజు హాజరై మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి సమన్వయంగా పనిచేసే సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తమ దృష్టికి తీసుకొస్తే మంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుగుణాకరరావు, ఈవో జి.జనార్దన్‌రావు, ఉప సర్పంచ్ కర్రి రాము నాయుడు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

అనస్తీషియాలో నూతన ఆవిష్కరణలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: అనస్తీషియాకు సంబంధించిన నూతన ఆవిష్కరణలను వైద్యులు ఉపయోగించుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ,ఎనస్తీషియా వైద్య నిపుణులు డాక్టర్ డివిజి శంకరరావు సూచించారు.ఐఎస్ఏ రాష్ట్ర సంఘం 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నంలో జరుగుతున్న దక్షిణ భారతదేశ స్థాయి వైద్యుల సదస్సులో ఒక సెషన్ కు డాక్టర్ శంకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగానికి సంబంధించిన అన్ని విభాగాలలో ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు వస్తూనే వున్నాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఏడు రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది మత్తు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గేదెల సత్యం

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు, అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఇన్‌చార్జి పిపిగా గేదెల సత్యంను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (విజయవాడ) ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఫ్యామిలీ కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సత్యంను జిల్లా కోర్టు, సబ్ కోర్టు బాధ్యతలు కూడా చూడాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. డిఒపి ఆదేశాల మేరకు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబితకు, అసిస్టెంట్ కోర్టు న్యాయమూర్తి లక్ష్మి కుమారికి అందించి ఆయన విధులలో చేరారు. తనకు ఈ అవకాశం కల్పించిన జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు, మాజీమంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జీఓ. 4 పారా క్రీడాకారులకు వరం

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సారధి వెల్ఫేర్ బ్లైండ్ హాస్టల్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జి.ఓ. నంబర్ 4 పారా క్రీడలు ఆడే దివ్యాంగులకు వరం లాంటిదని అన్నారు. ఈ జి.ఓ. ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో 3 శాతం ఉద్యోగాలను ఎటువంటి రాత పరీక్ష గాని, ఇంటర్వ్యూ గాని లేకుండానే నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులో అడిగే విద్యార్హతను బట్టి నేరుగా ఉద్యోగాలు కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సారధి వెల్ఫేర్ బ్లైండ్ హాస్టల్ వ్యవస్థాపకులు ప్రదీప్, ద్వారకామయి అంధుల పాఠశాల వ్యవస్థాపకులు ఆశాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చింతలవలసలో డివిజనల్ పంచాయతీ అధికారి పర్యటన

విశాలాంధ్ర - డెంకాడ: డెంకాడ మండలం చింతలవలస గ్రామ పంచాయతీలో డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను, వాటర్ ట్యాంకులు క్లీనింగ్ తదితర అంశాలను పరిశీలించారు. పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వారిని ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌లలో క్లోరినేషన్ చేస్తున్నారా, క్లీనింగ్ చేస్తున్నారా తదితర అంశాలను అడిగి స్వయంగా పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, గ్రామ, సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

శాఖంబరిదేవిగా దుర్గమ్మ దర్శనం

విశాలాంధ్ర - కొత్తవలస : ఆషాడమాసం, వారాహిమాత నవరాత్రుల శుభ సందర్భంగా కొత్తవలస జంక్షన్లోని శ్రీ దుర్గాదేవి అమ్మవారు భక్తులకు శాఖాంబరి దేవిగా దర్శనమిచ్చారు. వారాహి నవరాత్రుల్లో చివర రోజైన శుక్రవారం ఆలయ

ప్రధానర్చకులు వెలివెల లక్ష్మిశ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, పండ్లతో విశేషాలంకరణ చేపట్టారు. శాకాంబరి అమ్మవారిని దర్శించడంతో ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని, గ్రామాల్లో పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని పూజించారు.

పాఠశాలల్లో పిల్లల చేరికపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో శుక్రవారం కుసుమూరు మోడల్ ప్రైమరీ స్కూల్ ను ఎంఈఓ త్రినాధరావు సందర్శించడం జరిగింది. స్కూల్ అసెంబ్లీ పరిశీలించి తగు సూచనలు చేయడమైనది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి హాజరై ఫలవంతంగా నిర్వహించాలని కోరడమైనది. పిల్లల చేరికలు ఎక్కువగా జరిగేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణ, త్రాగునీటి సౌకర్యం సరిగా ఉండేలా చూడాలి అని ఆదేశించారు. ఈ నెల 10.వ తేదీన జరగబోవు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో వయా రౌతు పేట మీదగా పెదబంటుపల్లి నుండి పతివాడపేట వరకు ఎంజీఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా కోటి 65 లక్షల అంచనా విలువ కలిగిన తారు రోడ్డు నిర్మాణానికి చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మేరకు సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా శత శాతం అమలుపరుస్తున్న ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినప్పటికీ, గత పాలకులు చేసిన తప్పిదాలను సవరించుకుంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఒక్కొక్కటి నెరవేర్చడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు కోట్ల మోతిలాల్ నాయుడు, మండల అభివృద్ధి అధికారి జి భాస్కరరావు, తహశీల్దార్ సులోచన రాణి, పంచాయతీరాజ్ ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళులు

విశాలాంధ్ర - విజయనగరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128 వ జయంతి ఉత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా జరిగింది. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సీతారామరాజు స్వాతంత్ర్య ఉద్యమానికి, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఓ మురళి, ఎస్‌డిసి ప్రమీలాగాంధీ, జిల్లా పర్యాటకాధికారి కుమారస్వామి, సెట్విజ్ సిఈఓ వెంకటేశ్వర్రావు, డిఐపిఆర్ఓ మల్లేశ్వర్రావు, కలెక్టరేట్ ఏఓ దేవ్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిధిగా హాజరై అల్లూరి సీతారామ రాజు చిత్ర

పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన్యంలో బ్రిటీషు వారి దోపిడీని ఎదుర్కొని, గిరిజనులకు అండగా నిలిచి, వారిని ఎంతగానో చైతన్యపర్చారన్నారు. భారత దేశానికికి స్వాతంత్ర్యం సాధించేందుకు, బ్రిటీషు వారితో అలుపెరగని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు చిన్న వయస్సులోనే బ్రిటీషువారి తూటాలకు నేలకొరిగా డన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఎఆర్ డిఎస్పీ వై.రవీంద్రా రెడ్డి, ఎఓ పి.శ్రీనివాసరావు, ఎస్బీ సిఐలు ఎవి లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఆర్ ఎన్. గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాస రావు, ఆఫీసు పర్యవేక్షకులు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొత్తవలస తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో రమణయ్య కొనియాడారు. కొత్తవలస క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గల అల్లూరి పార్కులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అలాగే స్వామి వివేకానంద వర్ధంతి వేడుకలను నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అల్లూరి సేవలు గుర్తించి, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్ర యానికి అల్లూరి పేరు పెట్టడం హర్షనీయ మన్నారు. కార్యక్రమంలో కొత్తవలస అధ్యక్షుడు గోపిరాజు, కార్యదర్శులు పీఎస్ వర్మ, హరిరాజు,

ట్రెజరర్ శ్రీనురాజు తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కారుడు 90 ఏళ్ల సిరివూరి గణపతిరాజుని ఘనంగా సత్కరించారు. పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్షత్రియ అసోసియేషన్ సభ్యులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారయ్య మాస్టారు సేవలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - నెల్లిమర్ల: బంగారయ్య మాస్టారు సేవలు స్ఫూర్తిదాయకం అని గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం తంగుడుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంగారయ్య మాస్టారుకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివుకు బంగారయ్య మాస్టారు ఉపాధ్యాయ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ నిరంతరం సామాజిక, విద్యార్థుల శ్రేయస్సు కోసం శ్రమిస్తూ పలువురు మన్ననలు పొందుతున్నారన్నారు. తంగుడబిల్లి ఉన్నత పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో తన వంతు కృషి చేశారనడంలో అతిశయోక్తి లేదని కొనియాడారు. ఆయన సేవా కార్యక్రమాలను గుర్తించి పలు స్వచ్ఛంద సంస్థలు అనేక సన్మానాలు చేసి జ్ఞాపికలు, షీల్డ్ మెమెంటోలు బహుకరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజామృతంతో వరి విత్తనాల శుద్ధి

విశాలాంధ్ర - బాడంగి: బాడంగి గ్రామంలో వ్యవసాయ అధికారి సూర్య ప్రకాష్ ఆదేశానుసారం రైతుల సమక్షంలో క్వాలిటీ బీజామృతంతో వరి విత్తనాలతో శుద్ధి కార్యక్రమాన్ని

శుక్రవారం ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది చేపట్టారు. దీనివల్ల శుద్ధి చేయడం వలన విత్తనం నుండి వచ్చే తెగులు భూమి నుండి వచ్చే తెగులు అరికడుతుందని అన్నారు. దిగుబడి వస్తుంది అని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వయసు సత్యనారాయణ వివరించారు. ఈ కార్యకమంలో రామలక్ష్మి, పి.చిన్నమి పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి: సీఐటీయూ

విశాలాంధ్ర - బొబ్బిలి : కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న అనేక ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయడానికి కుట్రలు చేస్తుందని ప్రభుత్వ రంగ సంస్థల కాపాడుకోవడానికి కార్మికులు ఉద్యోగులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కే సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు కార్మిక వర్గం, ప్రజలు ఐక్యంగా పోరాటం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి కళ్యాణ మండపంలో శుక్రవారం సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పోరేట్ సంస్థలకు అమ్మి వేస్తున్నారని విమర్శించారు. రైల్వే లైన్లను, ఎయిర్ పోర్టులను ప్రైవేటీకరణ చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు శేషగిరి, అంగన్వాడీ యూని యన్ నాయకులు కామేశ్వరి, నిర్మల, ఎండిఎం, ఆశ, మున్సిపల్ యూనియన్ నాయకులు రామలక్ష్మి, ఆశ శాంతమ్మ, ప్రసాద్, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివేకానంద వర్ధంతి

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: మోక్షవిద్య యోగమందిర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధాన ఆచార్యులు పివి కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మోక్షవిద్య యోగమందిర్ కార్యదర్శి శీలా కోటేశ్వరరావు యువతలో స్వామి వివేకానంద భావజాలాన్ని ప్రచారం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కే గోవిందరావు, వి పవన్, సంస్థ సభ్యులు బి నరేంద్ర, కే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సుపరిపాలనలో తొలి అడుగు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: మండల కేంద్రంలో శుక్రవారం విజయనగరం శాసన సభ్యులు పూసపాటి అతిథి గజపతిరాజు ఆదేశాల మేరకు బీసీ సాధికారత యాత కార్పోరేషన్ రాష్ట్ర మెంబర్ పట్నాల వెంకటేష్ ఆధ్వర్యంలో టిడిపి సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సమ్మెళ సురేష్ హాజరై పైడితల్లి అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి నివాళులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పుష్పగుచ్చాలతో నివాళులర్పించారు. అనంతరం కళాశాల నుంచి ఎస్.కోట పట్టణం వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనపై తిరుగుబాటు జెండా ఎగరవేసిన సాయుధ యోధుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే.వాసుదేవరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వి.సుధీర్, ఎన్ఎస్ఎస్ పిఓ పి.భాస్కరరావు పాల్గొన్నారు.

విజయనగరం ఫోర్ట్: విప్లవ నాయకుడు, మన్యం వీరుడు, అల్లూరి సీతా రామ రాజు, దివంగత మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిలను ఘనంగా నిర్వహించారు. విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు జరిపి ఘన నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, నగర మరియు పట్టణ నాయకులు పాల్గొన్నారు.

విధుల పట్ల బాధ్యతగా ఉండాలి

విశాలాంధ్ర -విజయనగరం: స్థాన చలనాలు జరిగిన పిమ్మట సచివాలయ కార్యదర్శులు తమ విధులు పట్ల మరింత బాధ్యతాయుతంగా, చురుకైన పాత్రను పోషించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కార్యదర్శులకు నిర్దేశించారు. ఈ మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్యదర్శులకు కార్యవర్తన పత్రాలను అందజేశారు. అడ్మిన్, ఎమినిటీస్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, శానిటేషన్ కేటగిరీలకు చెందిన కార్యదర్శులకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య జరిగిన బదిలీల అనంతరం స్థానచలనాలు పొందిన కార్యదర్శులు మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఏఓ సీతారామమూర్తి పాల్గొన్నారు.

నవధాన్యాల్లో పంట కోత ప్రయోగం

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని కొండ గంగుపూడి గ్రామంలో నవధాన్యాల సాగులో పంట కోత ప్రయోగం చేయడం జరిగిందని మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నువ్వుల్లో నవధాన్యాలు సాగు చేసి వరి నాట్లు వేసే ముందు నవధాన్యాలు సాగు చేయించడం జరిగిందని. నువ్వుల్లో నవధాన్యాలు వేయడం వలన నువ్వు వంటలు ఆదాయం పొందడంతో పాటు ఇతర పంటలతో కూడా ఆదాయం పొందవచ్చునన్నారు. అలాగే ఇంటి వినియోగానికి ఆకుకూరలు కాయగూరలు వాడుకొనవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సఫల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీరభద్ర స్వామి, పెంటయ్య,మల్లేష్ నాయుడు ఐసీఆర్ పీస్ రైతులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ చేసిన ఎంపీడీఓ

విశాలాంధ్ర రాజాం: రాజాం మండలంలోని జిసిపల్లి గ్రామ సచివాలయంను ఎంపిడిఓ వావిలపల్లి శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. గ్రామంలో శానిటేషన్ నిర్వహణ, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి సిబ్బందికి పలు సూచనలు చేసారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

వీధుల్లో అంధకారం

విశాలాంధ్ర - రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతాలలో వీధిలైట్లు వెలగక పోవడంతో పట్టణవాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈమధ్య కాలంలో మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగులు సమ్మె చేయడంతో ఈ మధ్యకాలంలో ఆగిపోయిన లైట్లు మరమ్మత్తులు చేసేందుకు సిబ్బంది లేక లైట్లు వెలగకపోవడంతో పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు అనేక అసౌకర్యానికి గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండడంతో పట్టణ చివర ప్రాంతాలలో అయితే రోడ్లపై పాములు, పురుగులు రోడ్డుపై కనిపిస్తున్నాయి వాటిని చూసి రోడ్డుపై వెళ్లేవారు భయభ్రాంతులకు గురవుతున్నారు. శుక్రవారం సాయంత్రం తో ఇంజనీరింగ్ సిబ్బంది సమ్మె విరమించడంతో అధికారులు వెంటనే డోలపేట పెద్ద వీధి, మీనాక్షి కాలనీ, మల్లికార్జున కాలనీ, ఆదర్శనగర్ ఇలాగే పలు ప్రాంతాలలో లైట్లు వెలగటం లేదు కావున వెంటనే అధికారులు స్పందించి ఈ లైట్లు వెలిగేటట్లు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

రాజాం మండల మహిళా సమాఖ్యకు కేంద్ర అవార్డు

రాష్ట్రంలో తృతీయస్థానం

విశాలాంధ్ర - రాజాం: రాజాం వెలుగు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రాజాం మండల సమాఖ్య కు జాతీయ స్థాయి ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డు దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెలుగు అధికారులకు మహిళా సంఘాలు ధన్యవాదాలు - తెలుపుతున్నాయి. గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి, సామాజిక సమీకరణ, మరియు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను సృష్టించడంలో రాజాం మండల సమాఖ్య నిరంతరం శ్రమిస్తోంది. స్వయం సహాయక బృందాలద్వారా మహిళలను సంఘటితం చేసి, ఆర్థిక సేవలు, నైపుణ్య శిక్షణ, మరియు మార్కెట్ లింకేజీలను అందించడం ద్వారా సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేయడం లో ఈ సమాఖ్య గ్రామీణ సమాజంలో గణనీయమైన మార్పును తీసుకొచ్చింది. లక్ష్యాలను సాధించడంలో అద్భుతమైన పనితీరును కనబరిచి, తృతీయ ఉత్తమ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్గా ఎంపికైంది. ఈ సమాఖ్య గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి, మరియు సామాజిక సాధికారతను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించింది. స్థానిక సంఘాలలో మహిళల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం ద్వారా రాజాం సమాఖ్య సమగ్ర అభివృద్ధికి దోహదపడింది.అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 22 మండల మహిళా సమాఖ్యలను అవార్డుకు ఎంపిక చేసింది. అందులో రాజాం సమాఖ్య కు తృతీయ స్థానం రావడం మరో విశేషం. ఈ నెల 10 న అవార్డుల ప్రధానోత్సవం న్యూఢిల్లీలో జరుగనున్నది. ఏసీ చిరంజీవి ధన్యవాదాలు తెలిపారుఈ సందర్భంగా ఏసీ చిరంజీవి మాట్లాడుతూ, అందరి సహకారంతో కార్యక్రమాలు నిర్వహించామంటూ,అవార్డు రావడం చాలా గర్వంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ డా. బిఆర్ అంబేద్కర్, డిఆర్డిఏ పిడి కల్యాణ చక్రవర్తి, స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్, లకు ఇప్పటివరకు ఏసీ గా పనిచేసి ఇటీవల విజయనగరం బదిలీ అయిన చిరంజీవి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా మహిళా సంఘం పాలకవర్గం, సంఘాల సభ్యులకు శుభాభినందనలు అన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

గంజాయి నియంత్రణే లక్ష్యం: ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: రైళ్ళలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా జూలై 3న రాత్రి ఫలక్‌నామా ఎక్స్ప్రెస్‌లో లోకల్ పోలీసు, జి.ఆర్.పి., ఈగల్, ఆర్.పి.ఎఫ్ పోలీసులతో సంయుక్తంగా బృందాలను ఏర్పాటు చేసి, ఆకస్మికతనిఖీలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ ఆదేశాలతో గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు ఈగల్, లోకల్ పోలీసు, గవర్నమెంట్ రైల్వే పోలీసు మరియు రైల్వే ప్రొటక్షన్ పోలీసులతో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి, ఫలక్నుమా ఎక్స్ప్రెస్ ట్రెయిన్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి ప్రధానంగా ఒడిస్సా రాష్ట్రం నుండి ఇతర ప్రాంతాలకు ట్రెయిన్స్ ద్వారా అక్రమంగా రవాణ అవుతుందన్న సమాచారంతో ప్రత్యేకంగా ట్రెయిన్స్ ను లక్ష్యంగా చేసుకొని తనిఖీలు చేపట్టామన్నారు. ఈ బృందం విజయనగరం రైల్వే స్టేషనులో ఫలక్నుమా ఎక్స్ప్రెస్ ఎక్కి విశాఖపట్నంకు చేరుకొనేలోగా అన్ని భోగీల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీలో ఎటువంటి గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలు లభించ లేదన్నారు. ఈ తనిఖీల్లో బొబ్బవలన ఎస్ఐ రాజేష్, జిఆర్పి ఎస్ఐ బాలాజీరావు, ఆర్.పి.ఎఫ్. ఎస్ఐ, 20మంది పోలీసుసిబ్బంది, డాగ్ స్క్వాడ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

విశాలాంధ్ర - బాడంగి: పేద ప్రజల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం ధ్యేయమని బొబ్బిలి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మీ నాయుడు అన్నారు. మండలం ముగడ గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద పేట వేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేస్తూనే సంక్షేమాన్ని అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వమే అని అన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను తెలుగుదేశం పార్టీ శ్రేణులు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చప్ప శివుడు నాయుడు, తెంటు మురళి, తోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా అనేక గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించారు.

ఆదర్శ కమ్యూనిస్ట్ మానికొండ సూర్యవతి స్ఫూర్తితో పోరాటం చేద్దాం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: దివంగత మానికొండ సూర్యావతి వర్ధంతి సందర్భంగా శుక్రవారం 46వ వార్డులో జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యాదర్శి రమణమ్మ మాట్లాడుతూ కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా ఇందువల్లి గ్రామంలో 1921లో సంపన్న కుటుంబంలో సూర్యావతి జన్మించారని ఆనాటి సామాజిక కట్టుబాట్ల కారణంగా చిన్న వయస్సులోనే వివాహాలు జరిపించేవారన్నారు. సూర్యావతికి కూడా 16 సంవత్సరాలకే మానికొండ సుబ్బారావుతో వివాహం జరిగిందన్నారు. మొట్టమొదటిసారిగా 1948లో సాహిత్యం ద్వారా మహిళల్లో అభ్యుదయ ప్రచారానికి 'ఆంధ్రవనిత' పత్రికను స్థాపించారని అభ్యుదయ భావాలు ప్రజల్లోనికి ప్రచారం కాకూడదనే కారణంతో అప్పటి ప్రభుత్వం పత్రికను రద్దు చేసిందన్నారు. పత్రికపై నిషేదాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేశారన్నారు. సూర్యావతి 1950వ దశకంలోనే నందమూరు పంచాయితీ ఎన్నికల్లో మూడు సార్లు ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. 1958లో ఎం.ఎల్.సిగా ఎన్నికై శాసన మండలిలో ప్రజా సమస్యలను ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకుపోలీసుశాఖ నుండి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, ఇతర నిరసన కార్యక్రమాలను నిర్వహించేందుకు తప్పనిసరిగా పోలీసుశాఖ నుండి ముందస్తుగా అనుమతులు పొందాలన్నారు. పోలీసుశాఖ నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. చట్టాన్ని గౌరవించాల్సి బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందని, అందుకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ నడుచుకొని, శాంతియుతంగా వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసనలు తెలియజేసేందుకు ముందుగా సంబంధిత డిఎస్పీ కార్యాలయానికి దరఖాస్తు చేసుకొని, అనుమతులు పొందాలన్నారు. ఎటువంటి ముందస్తు అనుమతులు పొందకుండా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, సమావేశాలు నిర్వహించడం వలన శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. కావున, ప్రజలు శాంతియుతంగా వ్యవహరించాలని, విజ్ఞతతో వ్యవహరించి ముందస్తు అనుమతులతోనే ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. అలాకాకుండా, చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తూ ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్వజన ఆసుపత్రిని తరలించండి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: విజయనగరం జిల్లా సర్వజన ఆసుపత్రికి విపరీతమైన రోగుల రద్దీ పెరగడం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో డాక్టర్లు, సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటం వలన సర్వజన ఆసుపత్రిని మెడికల్ కళాశాలకు తరలించి ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి ఆవరణలో క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చెయ్యాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా పౌరవేదిక ఆధ్వర్యంలో వివిధ ప్రజాసంఘాల నేతలతో కలిసి సర్వజన ఆసుపత్రిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ గాజుల రేగలో 70 ఎకరాల్లో విశాలమైన వాతావరణం లో మెడికల్ కళాశాల ని నిర్మించారని అక్కడే అత్యవసర క్రిటికల్ కేర్ కూడా నిర్మాణం జరుగుతుందని,750 బెడ్స్ గల అధునాతన ఆసుపత్రి భవనం కూడా ఉందని, ప్రస్తుతం ఉన్న సర్వజన ఆసుపత్రిలో పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండే అత్యాధునిక వైద్యం అందించే క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తే ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు,శ్రీ విజయదుర్గా విభిన్న ప్రతిభవంతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దవడ కొండబాబు,మీన,అంబెద్కర్ రైట్స్ అధ్యక్షుడు డాక్టర్ పి.వి.రమణ,పిడకల ప్రభాకరరావు,ఇప్పలవలస గోపాలరావు,కోటంశెట్టి శ్రీను,కనకా చారి,రాజారావు, రాంమోహన్, పట్నాల శ్రీను, నాగేశ్వరరావు, చిరంజీవి మరిసర్ల కృష్ణమూర్తి నాయుడు, ఈశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌కు కేంద్రంపై వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర - బొబ్బిలి: ఆపరేషన్ కగార్‌కు కేంద్రంపై వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మావోయిస్టులను అంతం చేయడానికి 2026 మార్చి 31 ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను మావోయిస్టులను పట్టుకొని హత్యలకు పాల్పడ్డారని అందుకు దేశంలో ప్రజలు ప్రజాసంఘాల నాయకులు అమర వీరుల స్ఫూర్తితో ఆపరేషన్ వ్యతి రేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ప్రగతిశీల కార్మిక సమైక్య, అమరుల బంధు మిత్రుల సంఘం, ఐఎఫ్టియు, తదితరులు పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతున్న అమెరికా, రష్యా జపాన్ తదితర దేశాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం దేశంలో 40 శాతం అడవులు ఉండాలని చట్టాలు చేసి పర్యా వరణాన్ని కాపాడుతుంటే భారత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అడవు లను ఆదివాసీలకు అప్పగించి సమయంలో 40 శాతం ఉన్న అడవులను నేడు బిజెపి మతోన్మాద ప్రధాని నరేంద్ర మోడీ హెూమ్ మినిస్టర్ అమిత్ షా లు భారతదేశంలో ఉన్న 140 కోట్ల జనాభా జీవితాలతో చెలగాట మాడ్డానికి పర్యావరణానికి తీవ్ర ముప్పు తేవడానికి ఆదాని, అంబానీలకు దేశంలో తొమ్మిది కోట్ల ఎకరాలను అప్పగించడానికి కుట్రలు చేస్తున్నారని భారతదేశంలో అడవుల శాతం 21 శాతానికి పడిపోతు ందని దీనితో పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడి అతివృష్టి అనావృష్టి వర్షాలు పడకపోవడం తీవ్ర ఎండలు అంటే ముప్పు వాటిల్ల ప్రమాదం ఉందని అందుకు ప్రజలంతా ఐక్యంగా అడవులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణం మహారాణిపేట వద్ద కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో కామ్రేడ్ గంటి ప్రసాదం 12వ వర్ధంతి సభ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

ముందుగా కామ్రేడ్ గంటి ప్రసాదం స్మార్త భవనం ఆవరణలో గల ప్రగతిశీల కార్మిక సమైక్య జెండాను అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షులు కామ్రేడ్ అంజమ్మ, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ పి ప్రసాద్, ప్రగతిశీల కార్మిక సమైక్య రాష్ట్ర కార్యదర్శి బి కొండారెడ్డి, పి కే ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ అన్నపూర్ణ, రాష్ట్ర రైల్వే రిటైర్మెంట్ ఉద్యోగులు సంఘం నాయకులు రంపా రాఘవరావు, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి మెరిగాని గోపాలం, పిల్ల లక్ష్మణరావు, పి కే ఎస్ జిల్లా అధ్యక్షుడు కార్యదర్శులు రాయితీ సత్యం, తమటాల అప్పలనాయుడు, దాసరి వెంకటరమణ రెడ్డి కుమార్ నాయుడు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మమ్మ నాయుడు, ప్రజా కళామండలి రాష్ట్ర బాధ్యులు తూ ముల సింహాచలం, నల్లి తవిటి నాయుడు, తదితరుల ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. అనంతరం కామ్రేడ్ గంటి ప్రసాదం 12వ వర్ధంతి సభకు కామ్రేడ్ రంపా రాఘవరావు అధ్యక్ష వహించారు. కామ్రేడ్ గంటి ప్రసాదం కోసం చేసిన పోరాట త్యాగాలను కొనియాడారు. ప్రజా కళామండలి గాయకులు తూముల సింహాచలం బృందం ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.

6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

విశాలాంధ్ర - విజయనగరం, కంటోన్మెంట్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా 6వ తేదీ ఆదివారం పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను విజయనగరం పశు వైద్య శాలలో నిర్వహించనున్నట్లు ఉప సంచాలకులు డాక్టర్. గంటి మహాలక్ష్మి తెలియజేశారు. జంతు ప్రేమికులకు పశువుల నుండి మనుష్యుల కు సోకే జూనోటిక్ వ్యాధుల మీద అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా పశు సంర్ధక అధికారి డాక్టర్. రమణ తెలియజేశారు. కావున ఈ అవకాశాన్ని పశు ప్రేమికులు, యజమానులు అందరూ ఉపయోగించి కోవాలని తెలిపారు.

నిర్దేశించిన జోన్లలోనే వీధి విక్రయాలు

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో నిర్దేశించిన జోన్లలో మాత్రమే వీధివిక్రయాలు సాగించుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య చిరు వ్యాపారులకు సూచించారు. ఈ మేరకు తోపుడు బండ్ల వర్తకులతో శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణ చర్యలలో భాగంగా నూతన విధానాలను అవలంభించబోతున్నట్లు చెప్పారు. నగరంలో రెడ్ జోన్, అంబర్ జోన్, గ్రీన్ జోన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జనసమ్మర్థం ఉన్న ప్రాంతాన్ని రెడ్ జోన్ గాను, నిర్దేశిత సమయంలో మాత్రమే చిరు వ్యాపారాలు చేసుకునే వెసులుబాటును కల్పిస్తూ అంబర్ జోన్లను, నిత్యం చిరు వ్యాపారుల సాగించుకునేందుకు గ్రీన్ జోన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రదేశాలను నిర్ణయించినట్లు చెప్పారు. కావున వ్యాపారులు నగర సుందరీకరణ, క్రమబద్ధీకరణకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు, టిపిఆర్ఓ సింహాచలం,సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. రెండు జిల్లాల వ్యాప్తంగా 20 లోకదాలత్ బెంచీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, , ఎక్సైజ్ కేసులు, భూమి తగాదా కేసులు, కుటుంబ తగాదాలు వాటర్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేసుకోవచ్చన్నారు.

బీజామృతంతో నారు శుద్ధి చేయాలి

విశాలాంధ్ర - వేపాడ: వరి నాట్లు వేసే రైతులు బీజామృతంతో వరి నారు శుద్ధి చేసి నాట్లు వేయడం వలన తెగులు నివారించవచ్చని మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ అన్నారు.శుక్రవారం మండలంలోని వీలుపర్తి గ్రామంలో గ్రామ సర్పంచ్ శానాపతి లీలా అప్పారావుల పొలంలో వరి నాట్లను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా బీజామృతంతో నారు శుద్ధి చేసి చిగుర్లు తుంచి కాలిబాటలు వేసి వరి నాట్లు వేశారు. బీజామృతంతో నారు శుద్ధి చేసి చిగుల్లుతుంచి నాటాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్పి గోకేడ వెంకట్రావు, గ్రామ పెద్దలు సేనాపతి అప్పారావు, గోకడ రామస్వామి నాయుడు పాల్గొన్నారు.

మంచి పుస్తకాలతో నైతిక విలువలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మంచి పుస్తకాలతో నైతికవిలువలు లభిస్తాయని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఇన్ ఛార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం తరపున ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి అక్కడి గ్రంథాలయం కోసం పుస్తకాలను ఇన్ ఛార్జ్ వైస్ ఛాన్సలర్‌కు అందచేసారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసన్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయం కేవలం అక్కడి విద్యార్థులకే కాక బయటి నుండి కూడా ఎవరైనా ఆ పుస్తకాలను చదుకునేందుకు ప్రత్యేక అవకాశం కల్పించామన్నారు. ఇన్ ఛార్జ్ వైస్ ఛాన్సలర్ ను సంఘం అధ్యక్ష కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, ఎం.సుభద్రాదేవి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిపాలన అధికారి డాక్టర్ ఎన్ వి ఎస్ సూర్యనారాయణ, కాగుపాటి నారాయణమూర్తి, డాక్టర్ జక్కు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యలపరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు.

అనధికార హోర్డింగ్‌లను అనుమతించం

విశాలాంధ్ర -విజయనగరం: అనధికార హోర్డింగులు, నిర్మాణాలను అనుమతించేది లేదని విజయనగరం నగర పలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో మరియు కామాక్షి నగర్ లో వివిధ అక్రమ నిర్మాణాలను ప్రణాళిక సిబ్బంది తొలగించి వేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో ఓ భవనం పై అంతస్తులో అనుమతులు లేని ప్రకటన బోర్డును (హెూర్డింగ్)

ఏర్పాటు చేసినట్లు గుర్తించిన ప్రణాళిక సిబ్బంది కమిషనర్ ఆదేశాలతో తొలగించి వేశారు. అలాగే కామాక్షి నగర్ లో వాణిజ్య భవనానికి ఆనుకొని అనుమతులు లేకుండా ఐరన్ మెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు గుర్తించి వాటిని కూడా తొలగించి వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ కొంతమంది ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్కడక్కడ వివిధ హెూర్డింగులు, నిర్మాణాలు చేపట్టడం తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే వాటిని తొలగించమని ప్రణాళిక సిబ్బందికి ఆదేశించామన్నారు.

9న దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొనండి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: కార్మికుల్ని బానిసల్ని చేసే 4 లేబర్ కోడ్లు రద్దు, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టం, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఉపాధి భద్రత, కనీస వేతనాలు అమలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు జూలై 9న దేశవ్యాప్త సమ్మె కు పిలుపునిచ్చాయని, కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు, అధ్యక్ష కార్యదర్శులు ఏ. జగన్ మోహన్ రావు, బి. రమణ పిలుపునిచ్చారు. కోట జంక్షన్ వద్ద సిమెంట్ కలాసీలు, ఆటో డ్రైవర్లుతో సమ్మె స్టిక్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్పత్తిలో కీలకమైన రైతాంగం, కార్మిక వర్గంపై కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి ముసుగులో యుద్ధం ప్రకటించిందన్నారు. దేశ సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం అవుతుందని, అత్యధిక మంది ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జులై 9న సమ్మెలో పని బంద్, టైర్ బంద్ పాటించి ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, రామనాయుడు, రమణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.